

రేపు పలాసలో ప్రజా ఫిర్యాదుల వేదిక

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని ఈసారి పలాస తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ నెల 30న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నారు. అలాగే 'మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా వినతులు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే శ్రీకాకుళం జడ్పీ సమావేశ మందిరంలో యథావిధిగా 'మీ కోసం' కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ఏడాదిలో ఉద్దానం-2 ప్రాజెక్ట్ పూర్తి



ఉద్దానం-2 ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తదితరులు

- ప్రజాభిప్రాయాలే ప్రామాణికంగా పాలన
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

పాతపట్నం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయాలే ప్రామాణికంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం కాగువాడలో రూ.265కోట్ల వ్యయంతో ఉద్దానం ఫేజ్-2 నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాదిలో ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని (మిగతా 8వ పేజీలో..)

2న వంశధార నీరు విడుదల

- విత్తనాలు, ఎరువుల సమస్య తలెత్తకూడదు
- అర్హులందరికీ అన్నదాత సుఖీభవ పడాల్సిందే
- సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): 'ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి ఇబ్బందులు లేకుండా వచ్చే నెల 2 నుంచి వంశధార నీటిని విడుదల చేయాలి. రైతులకు విత్తనాలు, ఎరువులు సమస్యలు తలెత్తకూడదు. రైతు సేవా కేంద్రాలు ద్వారా అన్నదాతల అవసరాలకు తగ్గట్లు డీఏపీ, యూరియా ఎరువులు సిద్ధం చేయాల'ని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

మాట్లాడారు. 'అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన ప్రతి రైతు ఖాతాల్లో నిధులు జమ చేయాలి. ఎక్కడైనా సాంకేతిక సమస్య ఉంటే వ్యవసాయశాఖ అధికారులు ముందుగానే గుర్తించాలి. జూలై 2 నాటికి (మిగతా 6వ పేజీలో..)



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ విజయ, పక్కన సీఈవో, జేసీ

పంచాయతీ నిధులపై గరంగరం

- వైసీపీ సభ్యులు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం
- నాలుగేళ్లుగా లేని బాధ్యత ఇప్పుడు వచ్చిందా? అని ఎన్ఈఆర్ నిలదీత
- వాడీవేడిగా జడ్పీ సర్వసభ్య సమావేశం
- కొన్ని సమస్యలపైనే చర్చ

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. శ్రీకాకుళంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, వైసీపీ సభ్యుల మధ్య పంచాయతీ నిధుల విషయమై చర్చ గరంగరంగా సాగింది. పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్లకు సంబంధించి నిధులు ఎప్పుడిస్తారని, నిధులు ఏమయ్యాయో లెక్క చెప్పాలని వైసీపీ సభ్యులు అధికారులను నిలదీశారు. దీంతో ఎమ్మెల్యే ఈశ్వరరావు మాట్లాడుతూ.. పంచాయతీలకు కేటాయించిన 14వ, 15వ ఆర్థిక సంఘం నిధులను గత వైసీపీ ప్రభుత్వం ఏం చేసిందో ముందుగా లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వైసీపీ సభ్యులు, ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. 'వైసీపీ పాలనలో పంచాయతీలకు నిధులు పూర్తిగా ఇవ్వకుండా గ్రామాల అభివృద్ధిని విస్మరించారు. ప్రస్తుత కూటమి పాలనలో నిధులు (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



సొంత మండలాల్లో కొనసాగించాలని ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)

ఏం చేస్తారో.. ఎలా చేస్తారో!

- సచివాలయాల ఉద్యోగుల బదిలీల్లో సిఫారసులు!
- ఒకేచోట ఐదేళ్లు పూర్తయిన వారికి స్థానచలనం
- రెండు రోజుల్లో ముగియనున్న ప్రక్రియ

మెళియాపుట్టి, జూన్ 28(ఆంధ్రజ్యోతి):

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల వేళ.. సిఫారసులు జోరందుకున్నాయి. సచివాలయ ఉద్యోగులకు అధికార పార్టీ నేతల సపోర్టు ఉంటే కోరుకున్న స్థానం దక్కినట్టే. లేదంటే అధికారులు బదిలీ చేసిన చోటుకు వెళ్లాల్సిందే అంటూ ప్రచారం సాగుతోంది. బదిలీల ప్రక్రియ పూర్తిచేసేందుకు ఇంకా రెండు రోజులే గడువు ఉంది. ఈ నేపథ్యంలో వారం రోజుల నుంచి సచివాలయ ఉద్యోగులు.. ఆయా పంచాయతీ నాయకుల సహకారంతో ఎమ్మెల్యేల సిఫారసుల కోసం పడిగాపులు కాస్తున్నారు. కొంతమంది ఉద్యోగులు ఎంత ఖర్చయినా పర్వాలేదు.. నచ్చిన స్థానానికి బదిలీ అయ్యేందుకు పడరానిపాట్లు పడుతున్నారు. రాజకీయ పలుకుబడి లేనివారు.. ఎక్కడికి బదిలీ చేసినా వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు సచివాలయ ఉద్యోగులకు సొంత మండలాల్లో విధులు కేటాయించకుండా బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నిబంధన విధించింది. దీన్ని వ్యతిరేకిస్తూ సచివాలయ ఉద్యోగులు రెండు రోజుల నుంచి ఆందోళనలు చేస్తున్నారు. సొంతమండలాల్లోనే పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రెండు రోజుల్లో బదిలీల ప్రక్రియ ముగియనుండడంతో ఉన్నతాధికారులు ఏమి చేస్తారో.. ఎలా చేస్తారోనని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలోని 85 వార్డు, 667 గ్రామ సచివాయాలు.. ఉన్నాయి. వీటిలో సుమారు 6,868 మంది వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులు పనిచేస్తున్నారు. వార్డు సచివాలయ ఉద్యోగులకు బదిలీల్లో భాగంగా సొంత వార్డు కాకుండా వేరే వార్డులో పనిచేసేందుకు అవకాశం ఇచ్చారు. కానీ, గ్రామ సచివాలయ ఉద్యోగులకు మాత్రం సొంత మండలాన్ని వీడాల్సిందేనంటూ బదిలీల మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు. దీంతో వారంతా సొంత మండలానికి దగ్గర్లో ఉన్న సచివాలయాలకు బదిలీ చేయించుకునేలా రాజకీయ నేతల సిఫారసు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కొంతమంది లేఖలు తీసుకుని ఉన్నతాధికారులకు ఇవ్వాలా? వద్దా? అని ఆలోచిస్తున్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో కొన్నిశాఖల్లో సిఫారసు లేఖలు పరిగణనలోకి తీసుకోలేదు. మరికొన్ని శాఖల్లో మాత్రం పరిగణలోకి తీసుకుని బదిలీ చేసినట్టు తెలుస్తోంది. రెవెన్యూశాఖలో ఒక తహసీల్దార్ బదిలీ కోసం ఓ ఎమ్మెల్యే సిఫారసు లేఖ ఇచ్చారు. కాగా, ఆ తహసీల్దార్‌కు పోస్టింగ్ ఇవ్వకపోగా, గతంలో పనిచేస్తున్న పోస్టు కూడా ఇవ్వలేదు. దీంతో సంబంధిత తహసీల్దార్ దీర్ఘకాలిక సెలవు పెట్టినట్టు సమాచారం.



ఈ నేపథ్యంలో సిఫారసు లేఖలు ఇచ్చేందుకు కొంతమంది సచివాలయ ఉద్యోగులు భయపడుతున్నారు.

సర్వీస్ రికార్డులో చిరునామా ప్రకారం..

సచివాలయ ఉద్యోగులకు వారి సర్వీసు రికార్డుల్లో నమోదైన చిరునామా ఆధారంగా సొంత మండలాన్ని అధికారులు గుర్తిస్తున్నారు. ఈ ఏడాది మే 31 నాటికి ఒకేచోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసినవారికి తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. దృష్టిలోపం, అనారోగ్య సమస్యలు (మిగతా 6వ పేజీలో..)

పైడికొండను తవ్వేస్తున్నారు

- ఇష్టారాజ్యంగా కంకర తవ్వకాలు
- రైల్వేపనుల పేరిట అక్రమాలు
- రాత్రివేళల్లో తరలింపు
- పట్టించుకోని అధికారులు



కంకర లోడు కోసం భారీ వాహనాలు



పైడికొండపై రాత్రివేళల్లో కంకర తవ్వకాలు

పొందూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కంకర, మట్టి అక్రమ తవ్వకాలు కొంత మందికి ఆదాయ వనరుగా మారింది. అనుమతి లేకుండా రోజూ లారీల్లో వందలాది లోడ్లు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల ముందు నుంచే లారీల్లో భారీగా కంకర తరలిపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పొందూరు మండలంలోని పైడికొండపై విస్తారంగా కంకర నిల్వలు ఉన్నాయి. కొంతమంది అక్రమార్కులు కమీషన్లు మాట్లాడుకుని గత ఐదు రోజుల నుంచి ఇష్టారాజ్యంగా కంకర తవ్వకాలు చేపడుతున్నారు. కొండకు సమీపాన 90-8 సర్వే నెంబర్‌లో స్థలం చదును పేరిట.. పైడికొండపై 42 సర్వే నెంబరులో(ప్రభుత్వ స్థలం) కంకర తవ్వకాలు సాగిస్తున్నారు. రైల్వే పనుల పేరిట ఇష్టారాజ్యంగా కంకర, మట్టిని తరలిస్తున్నారు. రాత్రివేళల్లో మూడు 200 సీసీ (భారీ) జేసీబీలతో 40 లారీల్లో వందలాది లోడులు రవాణా చేస్తున్నారు. రైల్వే పనుల పేరిట ఓ వ్యక్తి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నారనే ఆరోపణ లున్నాయి. రైల్వే పనులకు కంకర తరలించాలన్నా.. రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారుల అనుమతులు ఉండాలి. ఏ సర్వే నెంబరులో ఎంత కంకర అవసరమనే విషయాలతో అనుమతి తీసుకుని రాయల్టీ చెల్లించాలి. ఈ నిబంధనలేవీ పాటించకుండా కంకర తవ్వకాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జగనన్న కాలనీ (మిగతా 6వ పేజీలో..)

అనుమతి ఇవ్వలేదు..

రైల్వే పనుల కోసం కంకర తవ్వకాలకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. 90-8 సర్వే నెంబరులో పొలం చదును కోసం దరఖాస్తు చేసుకున్నారు.. వాటికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. అనుమతులు లేకుండా ప్రభుత్వ స్థలం (42 సర్వేనంబరు)లో కంకర తవ్వకాలు చేపట్టినవారిపై కేసులు పెడతాం. ఇప్పటికే వీఆర్వోలు పరిశీలించారు. తవ్వకాలు చేపట్టినట్టు గుర్తించారు.

-ఆర్.వెంకటేష్, తహసీల్దార్, పొందూరు



జలదిగ్బంధంలో ఆర్టీసీ కాంప్లెక్స్

అరసవల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఆర్టీసీ కాంప్లెక్స్ జలదిగ్బంధమైంది. కాంప్లెక్స్ ఆవరణలో ఎటు చూసినా మురుగునీరు కనిపించింది. మోకాలు లోతు నీటిలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ.. రాకపోకలు సాగించారు. వర్షం కురిస్తే చాలని.. నరకయాతన పడుతున్నామని పేర్కొన్నారు. ఈ సమస్య ఎప్పటికీ తీరుతుందోనని వాపోయారు.

ముగిసిన పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

ఎచ్చెర్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి పాలిసెట్ వెబ్‌కౌన్సెలింగ్‌లో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలన శనివారంతో ముగిసింది. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం 1,20,001 నుంచి చివరి ర్యాంకు వచ్చిన విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించగా 237 మంది హాజరయ్యారు. ఈ నెల 21 నుంచి 28 వరకు నిర్వహించిన ఈ కౌన్సెలింగ్‌కు మొత్తం 2,572 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, సహాయ కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.నారాయణరావు, సీనియర్ అధ్యాపకులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ పూర్తిచేశారు. కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపికకు వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ రెండు, మూడు రోజుల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ కొనసాగే వరకు మిగిలిన విద్యార్థులు ప్రాసెస్ చార్జీలు చెల్లించి సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవచ్చని వారు తెలిపారు.

ఆషాఢ మాసాన..



- కొత్త దంపతులకు తప్పని ఎడబాటు
- కన్నవారి ఇళ్లకు చేరిన కొత్తకోడళ్లు
- ఈ నెలలో పుణ్యతిథులు ఎన్నో

నరసన్నపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి):

ఆషాఢ మాసం వచ్చేసింది. ఈ మాసాన్ని శూన్య మాసమని కూడా అంటారు. ఇది శుభకార్యాలకు మంచిది కాదనే భావన చాలామందిలో ఉంది. ఈ నెలలో వివాహాలు, ఇతర శుభకార్యాలు చేయడానికి ఇష్టపడరు. కానీ వ్రతాలు, పూజలకు ఎంతో విశిష్టమైనది. సూర్యుడు మిథునరాశి నుంచి కర్కాటక రాశిలో ప్రవేశిస్తాడు. దీంతో ఉత్తరాయణ పుణ్యకాలం పూర్తయి దక్షిణాయణం మొదలవుతుంది. తొలి ఏకాదశి, గురుపౌర్ణమి, పూరీ జగన్నాథుడి ఉత్సవాలు... ఇవన్నీ వచ్చేది ఈ నెలలోనే. వర్షాల ప్రారంభానికి సంకేతం ఈ మాసం. ఈ నెలలో శ్రీమహావిష్ణువుకు ఎంతో ఇష్టమైన తొలి ఏకాదశి పర్వదినం మొదలవుతుంది. ఆషాఢం నుంచి శ్రీమహావిష్ణువు యోగ నిద్రలో ఉంటారని.. ఈ నెలలో వచ్చే తొలి ఏకాదశిని శయన ఏకాదశి లేదా తొలి ఏకాదశి అంటారు. ఈ నెలలో గురుపౌర్ణమి, జగన్నాథ స్వామి రథయాత్రలు నిర్వహిస్తారు. ఈ నెలలో వర్షాలు అధికంగా పడుతుంటాయి. అందుకే పూర్వం ఆషాఢ మాసంలో పెళ్లిళ్లు చేస్తే.. వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుందని వివాహాలు చేసేవారు కాదు. కాలక్రమంలో ఆషాఢ మాసం శుభకార్యక్రమాలకు మంచిది కాదనే భావన ఏర్పడింది.

పుట్టింటికి ఆడపిల్లలు..



ఆషాఢ మాసంలో కొత్త కోడళ్లు అత్తవారి ఇళ్ల నుంచి కన్నవారి ఇళ్లకు చేరుకున్నారు. ఈ నెలలో కొత్త అల్లుడు.. అత్త ముఖం చూడరాదని కొందరు.. అత్త కొత్త కోడలు ఒకే ఇంట్లో ఉండరాదని కొందరు.. ఎలా చూసినా కొత్త దంపతుల మధ్య ఎడబాటు మాత్రం తప్పదు.

వ్యవసాయ పనుల కోసమే..

మునుపటి కాలంలో గ్రామాల్లో పండుగలు, వేడుకలు, విశేషాలు, జాతరలు, వ్యవసాయ పనుల్లో వెసులుబాట్ల ఆధారంగానే జరిగేవి. ఆషాఢ మాసమంటే వర్షాలు మొదలై... వ్యవసాయ పనులు పుంజుకునే సమయం. పొలం పనులతో అందరూ హడావుడిగా ఉంటారు. ఇరు కుటుంబాల్లో వ్యవసాయ పనుల వెసులుబాటు కోసం కొత్త దంపతులను వేర్వేరుగా ఉంచే ఆనవాయితీని పెట్టుకున్నారని చెబుతారు. దీన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ఆషాఢ మాసంలో అత్త ముఖం అల్లుడు చూడటం అరిష్టమనే కఠిన నియమాన్ని విధించారని కూడా పెద్దలు చెబుతారు.



పుట్టే బిడ్డ ఆరోగ్యం కోసమే..

ఇదే కాకుండా మరో కోణంలో కూడా ఆషాఢ మాసంలో కొత్త జంటలు వేర్వేరుగా ఉండాలనే నియమాన్ని పెట్టినట్టు చెబుతారు. ఆషాఢ మాసంలో అమ్మాయి గర్భం దాలిస్తే ఏప్రిల్ నెలలో ప్రసవించాల్సి ఉంటుందని... వేసవి కాలంలో ప్రసవిస్తే బిడ్డకు మంచిది కాదనే ఉద్దేశంతోనూ ఈ ఎడబాటు కల్పించారని చెబుతారు. శాస్త్రాలు, విశ్వాసాలు, సంప్రదాయాలు, కట్టుబాట్లు... వీటి వెనుక విజ్ఞానంతో పాటు శాస్త్రీయత కూడా ఉందంటున్నారు. నేటి తరం భార్యాభర్తలు ఉద్యోగాలు చేస్తున్నందున కొత్తజంటలకూ కలసి ఉండక తప్పడం లేదు. ఒకేచోట ఉద్యోగాలు చేసేవారికైతే కలసి ఉండడం తప్పనిసరి.



గోరింట పూయాలని...



ఆషాఢంలో మహిళలు తప్పనిసరిగా గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీ. పిల్లల నుంచి పెద్దల వరకు గోరింటాకు చేతులకు పూసుకుంటారు. మహిళలు గోరింటాకు పెట్టుకోవడాన్ని శుభప్రదంగా భావిస్తారు. దీనివల్ల అందంతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుందని ఆయుర్వేదం చెబుతోంది. వర్షాకాలంలో చర్మవ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు గోరింటాకు దోహదపడుతుంది. అంతే కాకుండా గోరింటాకు ఎర్రగా పండడాన్ని శుభప్రదంగా మహిళలు భావించేవారు. నేటి తరం మహిళలు మోహిందీ సంస్కృతితో గోరింటాకుకు దూరంగా ఉంటున్నారు.

కన్నవారి ఇంటి మీద బెంగ పోగొట్టేందుకే..



కొత్తగా పెళ్లయిన అమ్మాయికి కన్నవారి ఇంటి మీద మనస్సులో బెంగ ఉంటుంది. భర్తతో మెట్టినింట ఉన్నా.. కొత్తలో కన్నవారి రాక కోసం రోజూ వేచి ఉంటుంది. ఇలాంటి మానసిక కుంగుబాటు నుంచి బయట పడేందుకు నెలరోజులు పాటు ఆషాడంలో కొత్తగా వివాహమైన ఆడపిల్ల పుట్టింట్లో ఉండాలని ఆచారం పెట్టారు. ప్రస్తుతం హాస్టల్‌లో జాయిన్ అయిన్ కొత్తవిద్యార్థికి హోంసిక్ హాలిడే ఇచ్చిన చందగా చెప్పుకోవచ్చు.

-దామ అమ్మాయమ్మ, పోగోడు



రెండు పాఠశాలలు.. ఇద్దరు విద్యార్థులు

- ప్రస్తుత విద్యాసంవత్సరంలో కొత్తగా చేరిని వైనం
- ఇదీ మతలబుపేట, అవతారాబాద్ ప్రాథమిక పాఠశాలల్లో పరిస్థితి

సరుబుజ్జిలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సరుబుజ్జిలి మండలంలోని మతలబుపేట, అవతారాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో రెండేళ్లుగా ఒక్కో విద్యార్థి మాత్రమే అభ్యసిస్తున్నారు. రొట్టవలస పంచాయతీ పరిధిలోగల అవతారాబాద్ పాఠశాలలో గత ఏడాది రెండో తరగతిలో ఉన్న బొంగు శ్రావణ్ ప్రస్తుతం మూడో తరగతి చదువుతున్నాడు. ఈ ఏడాది కొత్తగా విద్యార్థులు ఎవరూ చేరలేదు. దీంతో శ్రావణ్ ఒక్కరికే ఓ ఉపాధ్యాయిని బోధిస్తోంది. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలగా ఉండే మతలబుపేట విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ప్రాథమిక పాఠశాలగా మారంది. ఈ నేపథ్యంలో ఇక్కడ కూడా ఒకే విద్యార్థి అభ్యసిస్తున్నాడు. ఆ ఒక్కరికి ఓ ఉపాధ్యాయిని బోధిస్తోంది. మండలంలో పలు పాఠశాలల్లో కూడా తగినంత మంది విద్యార్థులు లేరు. నందికొండ, వెన్నెలవలస, చిగురువలస, కొండ్రగూడ, మూలసవలాపురం, రొట్టవలస (ఎస్) పురుషోత్తపురం పాలవలస ఎనిమిది పాఠశాలలో మాత్రమే ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన 37 ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఏకోపాధ్యాయనితో నిర్వహిస్తున్నారు.



శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యే ఎంజీఆర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విద్యార్థుల ఉన్నత చదువులకు ప్రభుత్వ ప్రోత్సాహం

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

కొత్తూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత చదువులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం వనప కేజీబీవీ అదనపు భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి అనేక పథకాలను అమలు చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంతోమంది ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాక ఇతర ప్రాంతాలు, దేశాలకు వలస వెళు తున్నారని, భవిష్యత్‌లో స్థానికంగానే ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఎమ్మెల్యేలతో కలిసి చర్యలు తీసుకుంటున్నానన్నారు. శ్రీకాకుళం జిల్లా ఉద్యోగాల గనిగా తయారు చేసేలా ప్రణాళికలు తయారు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను పాఠశాలల్లో కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలకు క్రీడా స్థలం లేదని తన దృష్టికి తీసుకువచ్చాని, సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశిస్తానన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అమ్మఒడి అందరికీ ఇస్తామని ప్రకటించి మోసం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే వారందరికీ తల్లికి వందనం ఇచ్చామని, దీంతో కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందన్నారు. ఆగస్టు నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ప్రభుత్వం కల్పించనుందని, మహిళలు జిల్లాలో ఎక్కడి నుంచి ఎక్కడుకు వెళ్లిన ఉచిత ప్రయాణం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, నివగాం, కొత్తూరు ప్రధాన రహదారులు, కాలు వల నిర్మాణం చేశామని, అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పశువుల దాణాను రైతులకు అందజేశారు. వంశధార నది ఫ్లడ్‌బ్యాంకు గట్లు, హైస్కూల్ వద్ద బస్సు షెల్టర్ నిర్మాణం చేపట్టాలని నివగాం గ్రామస్థులు విన్నవించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, తహసీల్దార్ కె.బాలకృష్ణ, ఎంపీడీవో వి.నీరజ, పలువురు టీడీపీ నేతలు ఆగతముడి మాధవరావు, వలురౌతు సుధాకరావు, అరుబోలు దశరథరావు, మాతల గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులపై గరంగరం

(ఐదో పేజీ తరువాయి)

మంజూరు చేయడంతో పంచాయతీలు ప్రాణం పోసుకుంటున్నాయి' అని ఎమ్మెల్యే ఎన్ఈఆర్ తెలిపారు వైసీపీ సభ్యులకు నిధుల విషయం ఇప్పుడు గుర్తుకు వచ్చిందా? అని నిలదీశారు. దీంతో జడ్పీ సీఈవో జోక్యం చేసుకుని, వివరాలను డీపీవో అందజేస్తారని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఏయే పంచాయతీలకు సంబంధించి నిధుల వివరాలు కావాలో అడిగితే, తక్షణమే వాటి వివరాలను అందజేస్తామని డీపీవో భారతీ సౌజన్య తెలిపారు. అలాగే 'తోటపాలెం, కుశాలపురం గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేశారు. కొన్నాళ్ల తర్వాత మళ్లీ వాటిని కార్పొరేషన్ నుంచి మినహాయించారు. కానీ ఆ రెండు గ్రామస్థులకు ఉపాధి పనులు, జాబ్ కార్డులు లేవ'ని ఎమ్మెల్యే ఈశ్వరరావు ప్రస్తావించారు. దీనిపై గెజిట్ వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని జడ్పీ సీఈవో తెలిపారు.

- 'టెక్కలి మేజర్ పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. వీధిలైట్లు వెలగడం లేద'ని జడ్పీటీసీ దువ్వాడ వాణి పేర్కొన్నారు. జడ్పీటీసీ నిధులతోనైనా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని జడ్పీ సీఈవో తెలిపారు. చెత్త తరలింపుపై 5 టన్నులు దాటి సేకరించే మేజర్ పంచాయతీలకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని జడ్పీ చైర్‌పర్సన్ వివరించారు.
- గోకులాలకు సంబంధించి బిల్లులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమయ్యేలా చర్యలు చేపడతామని డ్వామా పీడీ సుధాకరరావు తెలిపారు. మొక్కలు నాటేందుకు క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీచేస్తామన్నారు.
- ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, తదితర సరఫరాకు సంబంధించిన వివరాలను వ్యవసాయాధికారి త్రినాథరావు సభ్యులకు తెలియజేశారు. 'జిల్లాలో 2.85లక్షల మంది రైతులు రిజిష్టర్ అయ్యారు. వారిలో 2.78లక్షల మందికి ఈకేవైసీ కూడా పూర్తయింది. వారందరికీ అన్నదాత సుఖీభవ అందజేస్తామ'ని తెలిపారు.
- 'కంచిలి మండలంలో కిడ్నీ బాధితులు అధికంగా ఉన్నారు. డయాలసిస్ కేంద్రం కూడా ఉంది. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నామ'ని సభ్యులు ప్రస్తావించారు. నిరంతర సరఫరాకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.
- నారాయణపురం కాలువల వద్ద షట్టర్లు ఎప్పుడు ఏర్పాటు చేస్తారని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అడగ్గా.. 15 రోజుల్లో వేస్తామని ఎస్ఈ సుధాకర్ తెలిపారు.
- ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ నారాయణపురం కాలువ నుంచి సాగునీరు ఎప్పుడు విడిచిపెడతారని, కళింగపట్నానికి నీరు ఎప్పుడు విడుదల చేస్తారని అడగ్గా.. జూలై 15లోగా సాగునీరు అందిస్తామని ఎస్ఈ తెలిపారు. కాగా కొన్నిశాఖలపైనే చర్చ సాగి సమావేశం ముగిసింది. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, శ్రీకా కుళం, పార్వతీపురం మన్యం జిల్లా, విజయ నగరం జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

పైడికొండను తవ్వేస్తున్నారు

(ఐదో పేజీ తరువాయి)

మీదుగానే రాత్రివేళ అధిక లోడులతో లారీల రాకపోకలు సాగిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. అక్రమ తవ్వకాలపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నామని, ఏమీ చేసుకుంటారో.. చేసుకోండని సూపర్‌వైజర్ దురుసుగా సమాధానమిస్తున్నాడని పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి కంకర అక్రమ తవ్వకం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయల చెక్కును అందిస్తున్న భక్తులు

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం..

అరసవల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారికి శ్రీకాకుళానికి చెందిన ఎస్వీ సతీష్ కుటుంబ సభ్యులు రూ.1,11,111 విరాళంగా ఇచ్చారు. దేవాలయ అభివృద్ధి నిమిత్తం ఈ మొత్తం చెక్కు రూపంలో శనివారం ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మకు అందజేశారు. అర్చకులు వారిని వేదమంత్రాలతో ఆశీర్వదించగా స్వామివారి ప్రసాదాలు, జ్ఞాపికను ఈవో అందజేశారు. ఆలయ అర్చకులు దర్భముళ్ల శ్రీనివాసశర్మ, జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.


2న వంశధార నీరు విడుదల

(ఐదో పేజీ తరువాయి)


వంశధార ప్రధాన ఎడమకాలువ ద్వారా సాగునీరు విడిచిపెట్టేందుకు ముహూర్తం నిర్ణయించాం. అక్కడి ప్రజాప్రతినిధులు చేతులమీదుగా నీరు విడిచిపెట్టాలి. ముందుగా శివారు ప్రాంతాలకు సాగునీరు వెళ్లాలి. కాలువల్లో అడ్డంకులు తొలగించాలి. అవసరమైతే లష్కర్లను నియమించాలి. మూలపేట, మేఘవరం, బూరగాం, ఉమిలాడ వంటి శివారు ప్రాంతాలకు సాగునీరు అందే దిశగా చర్యలు చేపట్టాలి. 48ఆర్ గోపీనాథపురం ఛానల్ వద్ద ఏటా రైతుల నుంచి సాగునీరు అందడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఈసారి ఆ పరిస్థితి రాకూడదని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గొల్లూరు సమీపంలో వంతెన పనులు పూర్తిచేయాలని తెలిపారు. ఖాళీగా ఉన్న ఏఈ పోస్టుల భర్తీ అంశంపై ఉన్నతాధికారులతో మాట్లాడుతానన్నారు. ఇదిలా ఉండగా గొట్టాబ్యారేజ్‌కు 1,450 క్యూసెక్కుల సాగునీరు వస్తుందని ఈఈ శేఖరరావు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామన్నారు. అలాగే జిల్లాలో లక్షా 46వేల హెక్టార్లలో వరి పండించే ప్రాంతముందని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు కోరాడ త్రినాధస్వామి తెలిపారు. 255 మెట్రిక్‌టన్నుల డీఏపీ అవసరముందని గుర్తుచేశారు. సమావేశంలో వంశధార ఎస్ఈ స్వర్ణకుమార్, డీఈఈ శ్రీధర్, వ్యవసాయశాఖ ఏడీ జగన్మోహనరావు పాల్గొన్నారు.



సోంపేట: మత్స్యావతారంలో..



టెక్కలిలో మత్స్యావతారంలో..



ఎల్.ఎన్.పేటలో..



ఇచ్ఛాపురం: మత్స్యావతారంలో పూజలందుకుంటున్న జగన్నాథుడు

మత్స్యావతారంలో జగన్నాథుడు

జగన్నాథ స్వామి రథోత్సవం పురస్కరించుకుని శనివారం జగన్నాథ స్వామిని మత్స్యావతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



పాతపట్నం: మత్స్యావతారంలో జగన్నాథుడు



జలుమూరు: కూర్మావతారంలో పూజలందుకుంటున్న జగన్నాథస్వామి



కంచిలి: మత్స్యావతారంలో...

ఏం చేస్తారో.. ఎలా చేస్తారో!

(ఐదో పేజీ తరువాయి)

ఉన్నవారికి వెసులుబాటు కల్పించనున్నారు. వారు కోరుకున్నచోటుకు బదిలీ చేయనున్నారు. భార్యాభర్తలిద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు అయితే.. వారికి దగ్గర్లో స్థానానికి వెళ్లే వెసులుబాటు కల్పించారు. ఎ-కేటగిరి సచివాలయంలో ఆరుగురు, బి-కేటగిరిలో ఏడుగురు, సి-కేటగిరిలో ఎనిమిది మంది ఉద్యోగులు ఉండేలా బదిలీలు చేస్తారు. మిగిలిన ఉద్యోగులను బదిలీల తర్వాత ఇతర శాఖల్లో సర్దుబాటు చేయనున్నారు. నిబంధనల ప్రకారమే బదిలీలు జరుగుతాయని మెళియాపుట్టి ఎంపీడీవో ప్రసాద్‌పండా తెలిపారు. సర్వీసు రికార్డుల ప్రకారం ఐదేళ్ల ఒకే సచివాలయంలో పనిచేసిన వారి వివరాలను ప్రభుత్వానికి పంపించామన్నారు.



ఖాళీగా ఉన్న కౌన్సిలర్ల సీట్లు

సంతకాలు పెట్టి వెళ్లిపోయారు

- ఇదీ మునిసిపల్ సమావేశం తీరు

చిత్రం చూస్తున్నారుగా.. కుర్చీలు ఖాళీగా కనిపిస్తున్నాయి.. సభ్యులెవరూ రాలేదని భావించారో పప్పులో కాలేసినట్లే.. కొద్దిమంది మాత్రమే ఉన్నారు.. మిగిలిన వారు రాలేదా అన్న అనుమానం కలుగక మానదు. అయితే మిగిలిన సభ్యులు ఒక్కొక్కరు సంతకాలు పెట్టి జారుకున్నారు. ఇదీ శనివారం జరిగిన మునిసిపల్ సమావేశం తీరు. చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన మునిసిపల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. సభ్యులు రాక ఆలస్యం కావడంతో పాటు అజెండా చదువుతుండగా ఒకొక్కరుగా సంతకాలు పెట్టి వెళ్లిపోయారు. దీంతో అందరూ అవాక్కయ్యారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారానికి పాటుపడాల్సిన సభ్యులు ఇలా సంతకాలు చేసి వెళ్లిపోవడంపై విమర్శలు వినిపించాయి.

-పలాస, జూన్ 28 (ఆంధ్రజ్యోతి)

మరమ్మతులు లేక.. అగచాట్లు తప్పక

- అధ్వానంగా మారిన అధికారులు తిరిగేదారి ● వర్షం కురిస్తే బురదమయం
- ఇదీ హిరమండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి దుస్థితి



హిరమండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే మార్గం బురదమయమైన దృశ్యం

హిరమండలం, జూన్28(ఆంధ్రజ్యోతి): హిరమండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. నిత్యం అధికారులు ఈ రహదారిలోనే తిరుగుతున్నా కనీసమరమ్మతులకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రధానంగా దశాబ్దాల కిందట వేసిన మట్టి రహదారి కావడంతో చిన్నపాటి వర్షం కురిసినా బురదమయవుతోంది. రహదారిపై బురద నిల్వఉండడంతో పాదచారులు,వాహనచోదకులు పల్టీలు కొడుతున్నారు. ఈమార్గంలోనే తహసీల్దారు, ఎంపీడీవో, ఆర్అండ్‌బీ, పంచాయతీ, విద్యాశాఖ, వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయాలకు వందలాది మంది సిబ్బందితోపాటు ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ఆయా శాఖల ఉన్నతాధికారులు కూడా ఈ మార్గంలో పర్యవేక్షణకు వస్తుంటారు. దశాబ్దాలుగా మట్టి రహదారిగానే ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసినా బురదమయవుతోంది. ఈ మార్గంలో వాహనాలు రాకపోకల సమయంలో నడిచి వెళ్లేవారిపై బురద తుల్లిపోతుండడంతో అవస్థలకు గురవుతున్నారు. తక్షణమే ఆర్అండ్‌బీ అధికారులు రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులతోపాటు కార్యాలయాల సిబ్బంది కోరుతున్నారు.

పీఎన్‌డీటీ చట్టం కఠినంగా అమలు చేయాలి

- ఎన్‌టీఆర్ ట్రస్టు వైద్య సేవలు శతశాతం అందాలి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ చట్టాన్ని కఠినంగా(పీఎన్‌డీటీ) అమలుచేయాలని కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదేశించారు. శనివారం శ్రీకాకుళంలోని కలెక్టరేట్‌లో సలహాకమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగాకలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష, మూఢ నమ్మకాలపై ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవా పథకం ద్వారా ప్రజలకు సత్వర వైద్య సేవలందించే విషయంలో నిర్లక్ష్యానికి తావు లేదన్నారు.ప్రభుత్వం ఈ పథకం ఫలితాలను శతశాతం పేదలకు అందే విధంగా అధికారులు కృషిచేయాలన్నారు.ప్రైవేటుఆసుపత్రులు రోగుల నుంచి డబ్బులు వసూలుచేయరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐవీఆర్ఎస్ ద్వారా 387 కేసుల్లో ప్రజాభిప్రాయం కోరగా 20 కేసుల్లో ప్రైవేటు ఆసుపత్రులు డబ్బులు వసూలు చేశాయని ఫిర్యాదులు అందాయన్నారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ కళ్యాణబాబు, డీఐఓ రాందాస్, డిప్యూటీ డీఎంహెచ్‌వో మేరీ క్యాథరీన్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ వెంకటరావు, డీపీఎంవో బి.రవీంద్ర, ట్రైనింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జీవీ లక్ష్మి, స్వర్ణలత, బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రతినిధి ఎన్.ప్రసాదరావు, డిప్యూటీ డీఈఎంవో వేంకటేశ్వరరావు, కిమ్స్ ఆసుపత్రి ఏవో సోమేశ్వరరావు పాల్గొన్నారు.

1న శ్రీకూర్మనాథుని హుండీల లెక్కింపు

గార, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మనాథుని దేవస్థానం హుండీలను జూలై ఒకటోతేదీన ఉదయం పదిగంటలకు హుండీలను లెక్కించనున్నారు. అధికారులు, గ్రామపెద్దల సమక్షంలో తెరచి లెక్కించనున్నట్లు ఈవో కె.నరసింహనాయుడు ఒకప్రకటనలో తెలిపారు.

మడ్డువలస కాలువలో పూడికల తొలగింపు

జి.సిగడాం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట పరిధి నుంచి మెట్టవలస బ్రిడ్జి వరకు నాలుగు కిలోమీటర్ల మేర మడ్డువలస కుడి ప్రధాన కాలువలో పూడికలు తొలగించారు.కాలువలో ఏళ్లతరబడి పూడిక పేరుకుపోయినవిషయం విదితమే.ఈనేపథ్యంలో మడ్డువలస ప్రాజెక్టు నీటి యాజమాన్య సంఘంఅధ్యక్షురాలు మీసాల విజయమ్మ ఆధ్వర్యంలో ప్రాజెక్టు డిప్యూటీ ఈఈ ఈశ్వరప్రసాద్, ఏఈ రాజశేఖర్ పర్యవేక్షణలో పనులు చేపట్టారు.

కుట్టుశిక్షణ కేంద్రం పరిశీలన

కవిటి, జూన్28(ఆంధ్రజ్యోతి): కవిటిలో నిర్వహిస్తున్న కుట్టుశిక్షణ కేంద్రాన్ని శనివారం ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి పరిశీలించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని కోరారు.

సాగుదారులకు పట్టాలివ్వాలి

- మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధుల డిమాండ్



ఆందోళన చేస్తున్న మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధులు

ఎచ్చెర్ల,జూన్28(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొయ్యాం రెవెన్యూ పరిధిలోని బడివానిపేట పంచాయతీలోని జాలారికొయ్యాంలో సర్వేనెంబర్లు 341, 442లోని 40 ఎకరాలకు సంబంధించి సాగులో ఉన్న మత్స్యకారులకు సాగు పట్టాలివ్వాలని మత్స్యకారఐక్యవేదిక ప్రతినిధులు కోనాడ నర్సింగరావు, దుమ్ముఅశోక్, మైలపల్లి కామరాజు, చింతపల్లిసూర్యనారాయణ డిమాండ్‌చేశారు.శనివారం జాలారి కొయ్యాంలోని మత్స్యకారుల సాగులో ఉన్న ప్రభుత్వ గయాల్ భూమిలో ఐక్యవేదిక ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి భూముల్లో రైతులు జీడిమామిడి, సరుగుడు, నీలగిరి వంటి తోటలను సాగు చేస్తున్నారని తెలిపారు. ఈభూములను ఆక్రమించేందుకు కొంతమంది ప్రయత్నిస్తున్నారని, ఏళ్లతరబడిలో మత్స్యకారుల సాగులో ఉన్న వీటికి పట్టాలు మంజూరుచేయాలని డిమాండ్‌చేశారు. మత్స్యకార రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టంచేశారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు మత్స్యకార సంఘ నేతలు మూగి కొర్లయ్య, మారుపల్లి నారాయణరాజు, అంబటి రాంబాబు, కారి తాతారావు, వారది ఎర్రయ్య, మధు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

'స్వచ్ఛ పంచాయతీ' సాధనకు కృషి చేయాలి



కోటపాలేం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలిస్తున్న భారతి

రణస్థలం,జూన్ 28(ఆంధ్రజ్యోతి):స్వచ్ఛపంచాయతీ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి కోరారు. శనివారం కోటపాలెం పంచాయతీ నిర్వహిస్తున్న సంపదతయారీకేంద్రాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా తడి,పొడి చెత్త నిర్వహణపై ప్రజలకు అవగహన కల్పించాలని సూచించారు. ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్‌పై అవగహన కల్పించారు. సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని కోరారు.

కార్యదర్శుల సంఘం కార్యవర్గం ఎన్నిక

కంచిలి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కంచిలి మండల పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం జరిగింది. సంఘ గౌరవాధ్యక్షుడిగా ఎస్.పాపారావు, అధ్యక్షుడిగా ఎస్.ప్రేమ్‌కుమార్, కార్యదర్శిగా వై.తులసయ్య, ఉపాధ్యక్షులుగా ఎన్ని రాంబాబు, జాయింట్ సెక్రటరీగా లీలాకుమారి, బి.చైతన్య, కోశాధికారిగా అనీల్‌కుమార్, ఉపకోశాధికారిగా బి.శ్రీనివాసరావు, కోఆర్డినేటర్‌గా డి.సంతోష్‌ను ఎన్నుకున్నట్లు గౌరవాధ్యక్షుడు పాపారావు శనివారం ఒకప్రకటనలో తెలిపారు.నూతన కార్యవర్గసభ్యులను ఎంపీడీవో వి.తిరుమలరావు అభినందించారు.

ఎమ్మార్పీకి ఎరువులు విక్రయించాలి

ఎచ్చెర్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఎరువులు ఎమ్మార్పీకి లోబడి విక్రయించాలని మండల వ్యవసాయాధికారి వావిలపల్లి రాజేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ధర్మవరం, పొన్నాడ గ్రామాల్లోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు కొనుగోలు చేసిన ప్రాప్తికి రశీదు తప్పనిసరిగా అందజేయాలని కోరారు. దుకాణాల్లోని వరి విత్త నాల నమూనాలను సేకరించి తాడేపల్లిగూడెంలోని రీజినల్ కోడింగ్ సెంటర్‌కు పంపిస్తామని తెలిపారు. అనంతరం స్టాక్‌రిజిస్టర్‌ను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి సీహెచ్ జగన్మోనరావు పాల్గొన్నారు.

పీవీకి ఘన నివాళి

అరసవల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి):స్థానిక ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో శనివారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాథరావు ఆధ్వర్యంలో పీవీ నరసింహారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెంబూరు మధుసూదనరావు, చాంద్‌భాషా, ఆబోతుల వెంకటనాయుడు, బొత్సవెంకటరమణ, చంద్రశేఖర్, లీలారాణి, అప్పారావు, సిరియా బేగం పాల్గొన్నారు.

బూరగాంలో నట్టల నివారణ మందు పంపిణీ

కంచిలి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బూరగాంలో శనివారం 2500 గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేసినట్లు ప్రాంతీయ పశువైద్య సహాయ సంచాలకులు కె.అప్పలస్వామి తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై పదోతేదీ వరకు గొర్రెలు, మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు అందజేస్తామన్నారు.కార్యక్రమంలో భువనేశ్వర్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు అరుణ్‌కుమార్ పండా, బ్రీగేశ్వర్, సంజయ్‌కుమార్, మండల పశువైద్యాధికారి టి.శిరీష, రాజేష్, హరీష్, వలి, విజయ్, రబియా పాల్గొన్నారు.

పాత నేరస్థులపై నిఘాపెట్టాలి: ఎస్పీ



మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీట్ సిస్టమ్‌ను పటిష్టంగా అమలుచేసి సెస్పెక్ట్, రౌడీషీటర్లు, పాత నేరస్థులపై నిరంతరం నిఘా పెట్టాలని పోలీస్ అధికారులను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు.శనివారం శ్రీకాకుళంలో పీజీఆర్ఎస్ ఫిర్యాదులు, బీట్ సిస్టం అమలు, విజిబుల్ పోలీసింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్స్‌సంకల్పం, నాన్ బెయిల్‌బుల్ వారెంట్లు, ముఖ్యమైన గ్రేవ్ కేసులు దర్యాప్తు, అరెస్టు, ప్రాపర్టీసిజ్ తదితర అంశాలపై ఎస్పీ నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం లేకుండా పరిష్కరించాలని కోరారు.నాన్ బెయిల్‌వారెంట్స్ వీలైనంత వరకు అమలు చేసి న్యాయస్థానంలో హాజరుపరాచాలనికోరారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల్లో పారదర్శకంగా దర్యాప్తు పూర్తిచేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలన్నారు. కాగా ప్రాపర్టీ కేసులు, ప్రాపర్టీ రివకరీ, ముద్దాయిలు అరెస్టు, చాకచక్యంగా చేధించడం, ముఖ్యమైన కేసుల్లో ప్రతిభ చూపిన టౌన్ సీఐ పైడిపునాయుడు, సీసీఎస్ సీఐ సూర్యచంద్రమౌళి, పాతపట్నం సీఐ రామారావు, సైబర్‌సెల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు హరికృష్ణ, రాము, మధుసూదన్, గోపూర్, హెచ్‌సీ,కానిస్టేబుల్ వారికి ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, అప్పారావు, ప్రసాదరావు, ఏవో గోపీనాథ్, ఎస్‌బీ సీఐ ఇమ్మన్యుల్ రాజు, డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి: ఎమ్మెల్యే



అరసవల్లి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండుశంకర్

అరసవల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి):మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపునిచ్చారు. శనివారం శ్రీకాకుళంలోని మెప్మా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్యామ్‌సంగ్ ట్యాబ్‌లు, స్కానర్లు, డిజైజర్లను ఆర్పీలకు అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధికి ప్రభుత్వంఅండగా ఉంటుందని తెలిపారు. అలాగే శ్రీకాకుళంలోని ఎస్పీ బంగా దగ్గర గల శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నూతన భవనంప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, కళాకారుల సమాఖ్య సభ్యులు పన్నాల నరసింహమూర్తి, రామచంద్ర దేవ్, చిట్టి నాగభూషణరావు, కవ్వాడి సుశీల, జయమ్మ పాల్గొన్నారు.

పోడు భూములకు హక్కుపత్రాలు ఇవ్వాలి

లావేరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జీజీవలసలో సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో శనివారం జనజాతీయ గౌరవవర్ష వేడుకలు నిర్వహించారు. గ్రామంలో వైద్య, పశువైద్య, ఐసీడీఎస్,తదితర శాఖలకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా గ్రామస్థులకు గిరిజన కులధృవీకరణ పత్రాలు శ్రీకాకుళంఆర్డీవో కార్యాలయం వద్ద ఇవ్వడంతో ఇబ్బందిపడుతున్నామని లావేరు తహసీల్దార్ కార్యాలయంలో ఇప్పించేలా చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామ సమీపంలోని 100 నుంచి 150 ఎకరాల వరకు పోడు భూమిని తరాలుగా సాగుచేస్తున్నామని వాటికి సంబంధించి హక్కు పత్రాలను అందించాలని కోరారు.కార్యక్రమంలో ఎంపీడీవో పి.వెంకటరాజు, ఐటీడీఏ-సీతంపేట స్పెషల్ ఆఫీసర్‌జాన్‌ఆప్ దయానంద్,ఏఎంసీ మాజీచైర్మన్ తోటయ్యదొర, విద్యుత్ ఏఈ కె.అప్పన్న, పీఆర్ ఏఈ శ్రీవల్లి, హౌసింగ్ ఏఈ రమేష్ ఏవో మహేష్ నాయుడు, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంస్థాగతంగా బలోపేతమే లక్ష్యం

- ఇచ్ఛాపురం నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు



కవిటి: మాట్లాడుతున్న విఠల్

కవిటి, జూన్28(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటుచేసి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని ఇచ్ఛాపురం నియోజకవర్గ టీడీపీ పరిశీలకులు పి.విఠల్, ఎల్.కామేష్, డి.తాతారావు తెలిపారు. శనివారం రామయ్యపుట్టుగలో నియోజకవర్గంలోని స్థాయి మండలకమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విఠల్ మాట్లాడుతూ మండలస్థాయిలో ఏర్పాటుచేసిన కమిటీలతోచర్చించి గ్రామ,బూత్ స్థాయిల్లోకమిటీలతోపాటు యూనిట్ కన్వీనర్,కో కన్వీనర్ల నియామకం త్వరగా పూర్తిచేస్తామన్నారు.రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడినా పార్టీ కార్యకర్తలకు సరైన న్యాయం జరగడంలేదని కొందరు మండలనేతలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మణిచంద్రప్రకాష్, కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి మండల పార్టీఅధ్యక్షులు పి.కృష్ణారావు, పద్మనాభం, తవిటయ్య, రామారావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం టీడీపీ పట్టణాధ్యక్షుడిగా తవిటయ్య

ఇచ్ఛాపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం టీడీపీ పట్టణా ధ్యక్షుడిగా పత్రి తవిటయ్య ఎన్నికయ్యారని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తెలిపారు. రామయ్యపుట్టగలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శిగా నందిగం కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా బత్తిన కుష్ణయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా నీలాపు వెంకటరెడ్డి,దట్టి శ్రీను, ఆశి మోహన్, కార్యదర్శులుగా శాసనం శేఖర్, పైల నారాయణ, బచ్చు సత్యరెడ్డి, కోశాధికారిగా గొర్లె నాగరాజులు ఎన్నికైనట్లు చెప్పారు.ఈ మేరకు ఎన్నికైన కార్యవర్గాన్ని అశోక్ అభినందించారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఇద్దరి ఎంపిక



రామ్మోహనరావు, యమున

శ్రీకాకుళంస్పోర్ట్స్, జూన్28 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మండలంలోని అక్కులపేటకు చెందిన సత్తారు రామ్మోహనరావు, పలాస మండలంలోని పల్లిసారధికి చెందిన పోతనపల్లి యమున జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరూ ఆదివారం నుంచి జూలైఒకటో తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలకు హాజరుకానున్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో జిల్లా నుంచి పాల్గొన్న వీరిద్దరూ ప్రతిభ కనబరచడంతో ఎంపికయ్యారు. ఈ మేరకు రామ్మోహనరావు, యమునలను జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, సంఘం అధ్యక్షులు నక్క రామకృష్ణ, కార్యదర్శి సాధు మునలినాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, ట్రెజరర్ నాగళ్ల రమేష్ అభినందించారు.

బాక్సింగ్‌లో భార్గవ్‌కు కాంస్య పతకం

జిల్లాకు చెందిన సత్యభార్గవ్ హర్యానాలో జరిగిన ఆరో జూనియర్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటాడు. ఈ మేరకు జిల్లా నుంచి రాష్ట్ర జట్టు తరుపున పాల్గొనేందుకు ఎస్.దేవి వరప్రసాద్, సత్యభార్గవ్ అర్హత సాధించారు. ఇందులో సత్య భార్గవ్‌కు కాంస్య పతకాన్ని సాధించాడు. ఈమేరకు భార్గవ్‌కు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి బీఏ లక్ష్మణ్‌దేవ్, శిక్షకుడు ఎం.ఉమామహేశ్వరరావు, సీనియర్ బాక్సర్లు, తోటి క్రీడాకారులు అభినందించారు.

వారాహి మాతకు పూజలు

ఇచ్ఛాపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మునిసిపాలిటీ 18వ వార్డులో వెలసిన బాలబ్రహ్మానంద సరస్వతీ ఆశ్రమంలో ఆషాడగుప్త నవరాత్రుల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శనివారం స్వప్న వారాహిమాతగా ప్రత్యేకపూజలను బాలబ్రహ్మానంద సరస్వతి ఆధ్వర్యంలో చేపట్టారు.ఈపూజలు జూలై నాలుగో తేదీ వరకూ కొనసాగుతాయి.

ట్యాపు లేక.. తాగునీరు వృథా



ట్యాంకు వద్దగల ట్యాపు నుంచి నీటిని అరికట్టడానికి కర్రముక్కను ఏర్పాటుచేసిన దృశ్యం

పలాస రూరల్, జూన్28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నాదేవిలో ఏర్పాటు చేసిన నీటి ట్యాంకు వద్ద కొళాయికి ట్యాపు లేకపోవడంతో తాగునీరు వృథా అవుతోంది. నెలరోజుల కిందట ట్యాపు పాడవడంతో కొందరు గ్రామస్థులు కర్రముక్కలను ఏర్పాటుచేసి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకొన్నారు. ఇక్కడ 220 మందికి ఈ నీటి ట్యాంకే ఆధారం. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కొళాయికి మరమ్మతుచేసి ట్యాపును ఏర్పాటుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆదిత్య ఆలయ టెండర్ల ఖరారు

అరసవల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆదిత్యాలయంలో సంవత్సర కాలానికి కొబ్బరి చెక్కలు, మరో 14 రకాల వస్తువుల సరఫరా, సేవలకు సంబంధించి ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్, ప్రధాన అర్చకులు ఇప్పిలిశంకరశర్మ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన టెండర్ల ప్రక్రియలో 12 టెండర్లు ఖరారయ్యాయి.భక్తులు సమర్పించే కొబ్బరిచెక్కలకు సంబంధించి పెద్దపాడుకు చెందిన కలగ తిరుమలరావుకు రూ.17,35,000లకు ఖరారయ్యింది.ఆలయంలో లక్ష రూపాయల లోపుగల చిన్నచిన్న 14 టెండర్లకు గాను 11 టెండర్లు ఖరారుచేశారు. మరోమూడు టెండర్లు వాయిదాపడ్డాయి. కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది గురునాథరావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.వెంకట రమణ, జూనియర్ అసిస్టెంట్ బాల భాస్కర్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ఆమదాలవలస, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించాలని మునిసిపల్ మాజీ చైర్మన్ కోన అప్పలనాయుడు కోరారు. శనివారం పట్టణంలోని పాలపోలమ్మ తల్లి గుడి ఆవరణలో మొక్కలు నాటారు.

యువత ఆర్మీలో చేరాలి

- బీజేపీ నాయకుడు పోకతోట సింహాచలం



మాట్లాడుతున్న సింహాచలం

అరసవల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి):యువత ఆర్మీ లేదా బీజేపీలో చేరాలని బీజేపీ నాయకుడు పోకతోట సింహాచలం పిలుపునిచ్చారు. శనివారం డ్రీం ల్యాండ్ రిసార్ట్‌లో రవితేజ డెవలపర్స్ అధినేత, బీజేపీ నాయకుడు పోకతోట సింహాచలం జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు మాట్లాడుతూ సింహాచలం ఒకవైపు వ్యాపారం చేస్తూ, మరోవైపు తన సంపాదనలో పదిశాతం ప్రజల కోసం ఖర్చుచేస్తున్నారని, హిందూ ధర్మ పరిరక్షణకు కంకణం కట్టుకున్నారని కొనియాడారు. ఆయన నిస్వార్థ సేవకు చిరునామా అని, ఎవరికి కష్టం వచ్చినా నేనున్నాంటూ వారిని ఆదుకునేందుకు ముందుంటారన్నారు. పోకతోట సింహాచలం మాట్లాడుతూ చిన్నతనంలో ఆర్మీలో చేరి దేశానికి సేవలందించాలని కలలు కన్నాను కానీ కాలేకపోయానని తెలిపారు. దేశానికి సేవ చేయడం కన్నా గొప్ప విషయం వేరేదీ లేదన్నారు. కార్యక్రమంలో పూడి తిరుపతిరావు, శవ్వాన ఉమామహేశ్వరి, పైడి సింధూర, పైడి వేణుగోపాలరావు, ఆరంగి మురళి, అట్టాడ రవిబాబ్జీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీహెచ్‌పీ, భజరంగదళ్, ఏబీవీపీ కార్యకర్తలు, సభ్యులు పాల్గొన్నారు.

ఫార్మా రంగంలో విప్లవాత్మక మార్పులు

ఎచ్చెర్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఫార్మా రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని పల్సస్ సీఈవో డాక్టర్ గేదెల శ్రీనుబాబు తెలిపారు.శనివారం ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో ఫార్మా డీ ఆవిర్భావ్ పేరుతో స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25లో ఫార్మా డీ పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఈవీ నాగోజీ, యాజమాన్య ప్రతినిధులు బీవీఎస్ఎన్ మూర్తి, ఇప్పిలి కిశోర్, రఘు కార్తీక్, వైస్ ప్రిన్సిపాల్ తారకరామారావు, విభాగాధిపతి భానోజీరావు, ఏవో తిరుపతిరావు పాల్గొన్నారు.

జిల్లా వినియోగదారుల కోర్టు భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

శ్రీకాకుళం లీగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల కోర్టు భవనం నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించాలనిజిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.ఈ మేరకుశనివారం కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోక్యాంపు కార్యాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్ననాయుడుని బార్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, ఉపాధ్యక్షులు ఇప్పిలి సీతారావు, భవానీ ప్రసాద్, రమణమూర్తి పాల్గొన్నారు.

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ కల్పించాలి

పొందూరు,జూన్28 (ఆంధ్రజ్యోతి):పొందూరు రైల్వేస్టేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ప్రతినిధులు బలివాడ సత్యనారాయణ, కిల్లి శ్రీరామమూర్తి, పి.శ్రీనివాసరావు తదితరులు, రైల్వే కన్సల్టేటివ్ సభ్యులు కోరారు.ఈ మేరకుశనివారం ఆమదాలవలసలో రైల్వేశాఖ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సత్యనారాయణకు బీజేపీ రాష్ట్ర ఆర్టీఐ విభాగం కన్వీనర్ కిల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. పొందూరు రైల్వేస్టేషన్‌లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ సదుపాయం కల్పించాలని, పాసింజర్ వెయిటింగ్ హాల్‌ను నిర్మించాలని, లైదాం రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు.

వచ్చే నెలలో నిశ్చితార్థం..

● ఇంతలోనే రోడ్డు ప్రమాదం:యువకుడి మృతి


చైతన్య (ఫైల్)

వజ్రపుకొత్తూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కొండవూరు గ్రామానికి చెందిన కొరికాన చైతన్య (29) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. చైతన్య శనివారం రాత్రి పూండి నుంచి పలాస వెళ తుండగా బెండి గేటు సమీపంలో సాయిబాబా గుడివద్ద గుర్తు తెలి యని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లిదండ్రులు అమ్మ నమ్మ, గున్నయ్య ఏడేళ్ల కిందటే మృతి చెందారు. తమ్ముడు హరీష్‌తో కలిసి పూండిలో అద్దెఇంట్లో నివాసం ఉంటున్నాడు. సీమెన్‌గా పనిచేస్తున్న చైతన్య కొద్ది రోజుల కిందట గ్రామానికి వచ్చాడు. ఇటీవల చైతన్యకు వివాహం నిశ్చ యం కాగా జూలై 31న నిశ్చితార్థం కావాల్సి ఉంది. ఇంతలో ఈ ప్రమాదం జరిగింది. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు విలపిస్తున్నారు. ఘటనా స్థలాన్ని ఏఎస్‌ఐ రమణారెడ్డి పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడలో మత్స్యకారుడి మృతి


దొరబాబు(ఫైల్)

శ్రీకాకుళం రూరల్, జూన్28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దగనగళ్ల వానిపేట పంచాయతీ పరిధిలోగల చిన్నగనగళ్ల పేట గ్రామానికి చెందిన చిడిపిల్లి పరదేశి(48) వేట కోసం వెళ్లి మృతిచెందాడు. గ్రామస్థుల కథ నం మేరకు.. చిన్నగనగళ్లపేట గ్రామానికి చెంది న చిడిపిల్లి పరదేశి జీవనోపాధి కోసం కాకినాడకు వలస వెళ్లాడు. ఈనెల 27వ తేదీ రాత్రి సముద్రం లోకి వేటకు మరో ఆరుగురితో బోటులో బయలుదేరాడు. రాత్రి సమయంలో వేట జరుగుతుండగా బోటులో నుంచి కాలు జారి సముద్రంలో పడి గల్లంతయ్యాడు. ఈ మేరకు శనివారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో కాకినాడ హార్బర్‌కు మృతదేహం కొట్టుకొచ్చింది. పరదేశికి భార్య కొర్లమ్మ, కుమారుడు కార్తీక్ ఉన్నారు. పరదేశి మృతితో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

హిరమండలం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తంప గ్రామానికి చెందిన డోల దొరబాబు (36) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ ఎండీ యాసిన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. దొరబాబు ధనుపురం సమీపంలో 5 ఏళ్ల నుంచి ఓ దాబా నిర్వహిస్తుండేవాడు. దాబా ఏర్పాటు సమయంలో రూ.5 లక్షలు అప్పు చేశారు. వ్యాపారంలో నష్టం రావడంతో పాటు అప్పునకు వడ్డీ పెరగడంతో తీర్చలేక మనస్థాపం చెందాడు. అప్పు తీర్చలేక ఈనెల 26న గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి శ్రీకాకుళం రిమ్స్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు.

మఖరాపురంలో విద్యార్థిని..

కంచిలి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మఖరాంపురం గ్రామానికి చెందిన గుడియా సాయిసా(10) చికిత్సపొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గుడియా సాయిసా మఖరాంపురం ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. శుక్రవారం రాత్రి భోజనం అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తుండగా పాముకాటేసింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సోంపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బరంపురం ఆసుపత్రికి తరలించి చికిత్సపొందుతూ శనివారం సాయిసా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సాయిసా తండ్రి పూర్ణచంద్ర, తల్లి గీత కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎచ్చెర్ల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మి నాయుడుపేట పరిసరాల్లో ఓ ఇంట్లో పేకాటాడుతున్న ఎని మిది మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.68,180లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. తమ్మినాయుడుపేట, సమీప గ్రామాలకు చెందినవారుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కంచిలి, జూన్ 28(ఆంధ్రజ్యోతి):సోంపేట రైల్వే ఫ్లైఓవర్ సమీపంలో శనివారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో జెన్నాముయి గ్రామానికి చెందిన దుర్యోధన జెనా, తులసి జెనా, ఢిల్లేసు జెనా గాయపడ్డారు. కంచిలి పోలీసుల కథనం మేరకు.. జెన్నాముయి గ్రామానికి చెందిన దుర్యోధన జెనా గొల్ల కంచిలి గ్రామదేవత నిమ్మాశిని అమ్మవారి పూజారిగా పనిచేస్తున్నాడు. ఆలయంలో పూజలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులతో కలిసి తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. జాతీయరహదారిపై పలాస నుంచి ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి వచ్చి ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై ఉన్న ముగ్గురు కింద పడిపోవగా, కారు కొంత దూరం ఈడ్చుకువెళ్లింది. ముగ్గురూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న కంచిలి పోలీసులు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను సోంపేట సామాజిక ఆసుపత్రికి తరలించారు. కంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

240 మద్యం సీసాలు స్వాధీనం

లావేరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడుమూరు సంత జంక్షన్ వద్ద ఉన్న మద్య షాపు నుంచి అక్రమంగా తరలిస్తున్న 240 మద్యం సీసాలను శనివారం మధ్యాహ్నం టాస్క్ ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించి స్వాధీనంచేసుకున్నారు. షాపు నుంచి తామాడ, నేదురేపేట గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న గొలుసు దుకాణాలకు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపారు. అలాగే రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. వీటిని లావేరు పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు చెప్పారు. కాగా అక్రమంగా మద్యం తరలిస్తున్న వారిపై లావేరు ఏఎస్‌ఐ బి.జగన్మోహన్‌రావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీని ఢీకొన్న కారు

● శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒకరి మృతి


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పెళ్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట-రేణిగుంట జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమా దంలో ఒకరు మృతి చెందారు. ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు... శ్రీకాకుళం జిల్లాకు చెందిన మొహంతి సరస్వతి కుటుంబం హైదరాబాదులో నివాసం ఉంటోంది. శనివారం కుటుంబ సభ్యులందరూ కారులో హైదరాబాదు నుంచి తిరుమలకు బయలుదేరారు. పెళ్లకూరు మండలం ఎగువ చావాలి వద్దకు రాగానే వెనుక వస్తున్న లారీ ఓవర్ టేక్ చేసి ముందు వెళ్తూ షడన్ బ్రేక్ వేసింది. దీంతో కారు లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మొహంతి సరస్వతి(50), ఆమె భర్త గోవిందరాజు, కుమార్తె సాయినవ్య, లహరి, చెల్లెలు మీన తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా మొహంతి సరస్వతి మృతి చెందారు. మృత దేహానికి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిరమండలం అభివృద్ధికి కృషి

● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

హిరమండలం,జూన్28(ఆంధ్రజ్యోతి): హిరమండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న రోడ్డు, కాలువ పనులకు శంకుస్థాపన చేశారు. మోనింగి వాని చెరువులో అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు హిర మండలం మండల ప్రజలు, రైతులు త్యాగం చేయకపోతే వంశధార రిజర్వాయర్ నిర్మాణం జరిగి ఉండేది కాదన్నారు. వారి త్యాగాలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సమస్యలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జడ్పీటీసీ బుచ్చిబాబు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు తిరుపతిరావు వివరించారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. హిరమండలంలో ఉన్న అన్ని రోడ్లు డబుల్‌లైన్ చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండలానికి అవసరమైనన్ని లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టులు సీఎం చంద్రబాబుతో మాట్లాడి మంజూరు చేయిస్తానన్నారు. వంశధార, మహేంద్ర తనయ నదులపై వంతెనలను కేంద్ర నిధులతో చేపట్టేం దుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.


ఎల్ఎన్‌పేట: వినతులు స్వీకరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎల్.ఎన్.పేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజాదర్బార్ ప్రధాన లక్ష్యమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎంపీడీవో కార్యాల యంలో శనివారం రాత్రి ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకో వాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపైన చర్యలు చేపట్టేందుకు వెనుకాడేది లేద న్నారు. అనంతరం సబ్సిడీపై పాడి రైతులకు పశుదాణా పంపిణీచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, టీడీపీ నేతలు ఎం.మనోహర్ నాయుడు, కె.చిరంజీవి, వి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టండి

కొత్తూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కొత్తూరు కళాశాల సమీపంలోని ప్రధాన రహదారి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు శనివారం కొత్తూరు వచ్చిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి సమస్యను విన్నవించారు. గత మూడేళ్లుగా రోడ్డు గోతులమయమై ప్రమా దాలు జరుగుతున్నాయని, మురుగునీరు నిలువ వల్ల వ్యాధులు సంభవిస్తున్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను పరిష్కరించేలా చూడాలని కేంద్ర మంత్రి కలెక్టర్‌కు సూచించారు. అంత కుముందు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణమూర్తి స్వగ్రామం మాతలకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వెళ్లి అల్పాహారం స్వీకరించారు.

ప్రగతిపథంలో కోటబొమ్మాళి: మంత్రి అచ్చెన్న

కోటబొమ్మాళి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళిని ప్రగతిపథంలో నడిపిస్తానని రాష్ట్ర మంత్రి కిజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఉప ఖజాన భవనం, జిల్లా పరిషత్ బాలికల అనుబంధ వసతి గృహం, సీసీ రోడ్డును ప్రారంభించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా నిర్మించనున్న అన్నాక్యాంటీన్ భవనానికి, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదురుగా షాపింగ్ కాంప్లెక్స్‌కి, పాత ఫిష్ మార్కెట్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్, పాతపట్నం అమ్మవారి గుడి పక్క నుంచి ఊరమ్మతల్లి ఆలయం వరకు సీసీరోడ్డు పను లకు శంకుస్థాపన చేశారు. కొత్తపేటకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు వెళ్లిపోవడంతో కోటబొమ్మాళి బోసిపోయిందని, అందుకే డీసీసీబీ బ్యాంకు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించి, దుకాణాలను ఏర్పాటు చేసి టెక్కలి నుంచి శ్రీకాకుళం బస్సులు కోటబొమ్మాళి మీదుగా వెళ్లేలా చర్యలు తీసుకుంటానన్నారు. కొత్తపేట నుంచి కోటబొమ్మాళి పెద్ద చెరువు వరకు సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. కోటబొమ్మాళి మండల కేంద్రంలోని అన్ని వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. డిగ్రీ కళాశాల మంజూరుకు చర్యలు తీసుకుం టాన న్నారు.

కార్యక్రమంలో ఖజానాశాఖాధి కారి డాక్టర్ మోహనరావు, జిల్లా ట్రెజరీ అధికారి సీహెచ్. రవి కుమార్, టెక్కలి ఆర్డీవో ఎస్.కృష్ణమూర్తి, తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరి వర ప్రసాద్, టీడీపీ నేతలు బోయిన గోవింద రాజులు, బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కీర్తిచక్ర పురస్కార గ్రహీతకు అభినందన

కోటబొమ్మాళి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ధైర్య సాహసాలు ప్రదర్శించి కీర్తి చక్ర పురస్కారం పొందిన సంతబొమ్మాళి మండలం నగిరిపెంటకు చెందిన మేజర్ మల్లా రాంగోపాల్ నాయుడుకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందించారు. శనివారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో రాంగోపాల్ నాయు డు కుటుంబ సభ్యులతో కలిసి మర్యాద పూర్వకంగా మంత్రిని కలిశారు. ఉగ్రవాదు లను మట్టు పెట్టడంలో రాంగోపాల్ చూపి న ధైర్య సాహసాలను మంత్రి అభినంది స్తూ కీర్తిచక్ర పురస్కారం తీసుకోవడం జిల్లాకు గర్వకారణమని మంత్రి కొనియాడారు. అలాగే ఇండియన్ ప్రీమియం లీగ్‌లో ఢిల్లీ క్యాపి టల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన త్రిపురాన విజయ్‌ని మంత్రి అభినందించారు. క్రికెట్ మ్యాచ్‌ల్లో మరింతగా ప్రతిభకనబరిచి ఆవకాశాలను అంది పుచ్చుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.


రాంగోపాల్ కుటుంబసభ్యులతో మంత్రి అచ్చెన్నాయుడు

ఉపాధ్యాయుడున్నా.. విద్యార్థుల్లేరు

● రెండేళ్లుగా ఒక్కరూ చేరని వైనం ● బోసిపోతున్న మహాదేవుపురం పాఠశాల

కొత్తూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం కురిగాం పంచాయతీ మహాదేవపురం గ్రామ పాఠశాలలో చది వేందుకు విద్యార్థులు లేకపోయినా ఉపాధ్యాయుడు టొంపల గణపతి ఒక్కరే విధులు నిర్వ హిస్తున్నారు. రేషలైజేషన్ పుణ్య మా అని పాఠశాలలో ఉన్న 3, 4, 5 తరగతులకు చెందిన నలు గురు విద్యార్థులను కురిగాం పాఠశాలలో విలీనం చేశారు. గత రెండేళ్లుగా పాఠశాలలో ఒకటి, రెండు తరగతులకు విద్యార్థులెవరూ చేరకపోవడంతో పాఠశాల బోసిపోయింది. దీంతో ఉపాధ్యాయుడు ఒక్కరే కాలక్షేపం చేస్తూ నెట్టుకొస్తున్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రం ప్రీస్కూల్ పిల్లలు ఇద్దరు ప్రైవేటు పాఠశాలకు వెళ్లి పోగా గ్రామంలో మరెవరూ చేరకపోవడంతో పాఠశాల మూత పడే పరిస్థితి నెలకొంది. పాఠశాలకు నూతన భవనం, కొత్త బెంచీలు ఉన్నప్పటికీ విద్యార్థులు లేరు. ఇదే విషయమై ఎంఈవో శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా రేషనలైజేషన్‌లో మహాదేవపురం పాఠశాల కురిగాంలో విలీనం కావడం, ఒకటి, రెండు తరగతులకు విద్యార్థులు లేరని, పాఠశాలను మూసివేసి ఉపాధ్యాయుడిని వేరే పాఠశాలకు డెప్యుటేషన్‌పై పంపుతామన్నారు.


విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు

5.29 లక్షల జీవాలకు నట్టల నివారణ మందు

పాతపట్నం/కోటబొమ్మాళి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): టెక్కలి డివిజన్ పరిధిలో 5.29 లక్షల జీవాలకు నట్టల నివారణ మందులు వేయనున్నట్లు పశు సంవర్ధక శాఖ డీడీ డాక్టర్ సీహెచ్ నర్సింహులు అన్నారు. శనివారం పాతపట్నం మండలం కోదూరు, కోటబొమ్మాళి మండలం చిట్టేవలస, గంగరాం పంచాయతీల్లో డీ వార్మింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 10వ తేదీలోగా నిర్దేశిత లక్ష్యాలు పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం ఆధునిక విధా నాలతో సాగవుతున్న పశుగ్రాస క్షేత్రాలను పరిశీలించారు. ఏడీలు డాక్టర్ మంచు కరుణాకర్, డాక్టర్ లోకనాథం, పశు వైద్యులు పి.అనిల్, ఎల్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు


విజేతలతో కరస్పాండెంట్ కవిటి భారతీ రేణుకేశ్వరరావు


కాశీబుగ్గ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ చినబాడాం శ్రీసాయి శిరీషా హైస్కూల్లో ఈ నెల 22న నిర్వహించిన శ్రీక్రిష్ణసాహితీ టాలెంట్ టెస్ట్ విజేతలకు నగదు బహుమతులను కరస్పాండెంట్ కవిటి భారతీ రేణుకేశ్వరరావు శనివారం అందజేశారు. ఈ పరీక్షకు ఒకటి నుంచి 8వ తరగతి చదువుతున్న 381 మంది విద్యార్థులు హాజరుకాగా వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు చొప్పున 12 మందికి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీతత్వం అలవరిచేందుకు ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏడాదిలో ఉద్దానం-2 ప్రాజెక్ట్ పూర్తి

(ఐదో పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ప్రజల అభ్యర్థన మేరకు ఉద్దానం-2 ప్రాజెక్ట్‌ను వంశధార, పాతపట్నం తాగునీటి పథకంగా నామకరణం చేయనున్నట్లు వెల్లడించారు. 'పాతపట్నం నియోజక వర్గం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాం. జిల్లాలో ఇప్పటికే రూ.400 కోట్లతో సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాం. మెళియాపుట్టిలో ఐటీడీఏ, పాతపట్నంలో పాలిటెక్నికల్ కళాశాల ఏర్పాటు దిశగా చర్యలు చేపడుతున్నాం. రైల్వేస్టేషన్ల అభివృద్ధి, రైల్వే సేవలు విస్తరణపై దృష్టి సారించాం. మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణం చేపడతాం. ఉపాధిహామీ వేతనదారుల కూలీలు పెంచేలా చర్యలు చేపడతాం. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు సేవలు కల్పిస్తామ'ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఉద్దానం ఫేజ్-2 నిర్మాణ పనులతో పాతపట్నం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలా లతో పాటు మన్యం జిల్లాలోని మరో రెండు మండలాలకు తాగునీరు అందనుందన్నారు. బూరగాం గ్రామస్థుల అభ్యర్థన మేరకు మహేంద్రతనయ నదిపై వంతెన నిర్మాణా నికి చర్యలు చేపడతామని తెలిపారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ సమాజం కోసం ఐక్యంగా ఉండాలి


మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు

పలాస, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రైస్తవ సమాజం కోసం అందరూ ఐక్యంగా ఉండాలని రాష్ట్ర పాస్టర్స్ లీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బాలరాజు అన్నారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ కార్యదర్శి డీవీడీవీ కుమార్(బోసుబాబు) అధ్యక్షతన చిన్నబడాం వద్ద జిల్లా అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ.. ఐక్యతతోనే సమస్యలు పరిష్క రించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుందర్‌సింగ్, జాషువా, హిజ్కియా, డేనియల్, పి.కృపానందం, భింకం బర్నబాస్, బెంజిమిన్, రవికుమార్, కాలేబు పాల్గొన్నారు.

గిరిజనుల భూములకు హద్దుల కేటాయింపు

హరిపురం,జూన్28 (ఆంధ్రజ్యోతి): బుడార్సింగి పంచాయతీ బెత్తుకోల గ్రామంలో నెలకొన్న భూవివాదం సద్దుమణిగింది. గ్రామ పరిధిలోని సుమారు 48 ఎకరాల జిరాయితీ భూమి కదంబాల సత్యనారాయణ, తల్లాప్రగడ లక్ష్మణరావు తదితరుల పేరున ఉంది. సమీపంలో గిరిజనులకు ప్రభుత్వ భూమికి డీ పట్టాలు అందజేసింది. దీంతో గిరిజనులు వారికి ఇచ్చిన భూములను కాదని జిరాయితీ భూములను సాగు చేశారు. దీంతో వారి మధ్య వివాదం నెలకొంది. దీంతో ఇటీవల గిరిజనులు తమ పట్టా భూములకు హద్దులు చూపించాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ శ్రీకాంత్, సర్వేయర్ బాబూరావు, సర్వే ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఏఎస్‌ఐ శేఖరరావు తదితరులు ఇరువర్గాల భూములను సర్వే చేసి హద్దులు వేశారు. దీంతో భూవివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు తదితరులు పాల్గొన్నారు.


క్షేత్రస్థాయిలో సేవలు అందించాలి

నరసన్నపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విస్తరణాధికారులు క్షేత్రస్థాయిలో వీఏఏలను సమన్వయం చేసుకుంటూ రైతులకు సేవలు అందించాలని ఏడీఏ వెంకట్ మధు అన్నారు. శనివారం ఏడీఏ కార్యాలయంలో ఏఈవోలు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారితో సమీక్ష సమావేశం నిర్వహించారు. నరసన్నపేట వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో 80 శాతం ఎదలు వేశారని వారికి యాజమాన్య పద్ధతులను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాసరావు, శిరీష, సాయిప్రసన్న కుమార్, శ్రీనివాసరావు, ప్రసాద్, భాను ప్రకాశ్, సురేష్ పాల్గొన్నారు.

గోగు పంటపై తెగుళ్ల నివారణకు చర్యలు

జలుమూరు, జూన్ 28: (ఆంధ్రజ్యోతి): గోగు పంటపై పేరుబంక, పిండినల్లి తెగుళ్లు సోకినట్లు ఆమదాలవలస వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు చిట్టిబాబు, సంధ్యారాణి, స్వాతి తెలిపారు. యలమంచిలి, అక్కురాడ గ్రామాల్లో సాగు చేస్తున్న గోగు పంటను శనివారం పరిశీలించారు. వేసవిలో పడిన వర్షాలకు సాగు చేసిన గోగుపంట ప్రస్తుతం శాఖీయ దశలో ఉందన్నారు. దీనిపై పేనుబంకం, పిండినల్లి తెగుళ్లు ఆశించినట్లు తెలిపారు. వీటి నివారణకు వేప నూనె 5 మిల్లీలీటర్లు లేదా ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లు చొప్పున లీటరు నీటిలో కలిపి మొక్కలపై పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం: బగ్గు



పోలాకి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థుకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశలో చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే బగ్గురమణమూర్తి అన్నారు. శనివారం మబగాం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు పుస్తకాల బరువు తగ్గించేందుకు సెమిష్టర్ విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ఎంతమంది పిల్లలున్నారో అందరికీ తల్లికివందనం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాధాకృష్ణ, టీడీపీ నాయకులు ఎంవీనాయుడు, భైరి భాస్కరరావు, కాయ రవి, తెలుగు పావని తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థుల చేరికలను పెంచాలి

కొత్తూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ ఉపాధ్యాయులకు సూచించారు. శనివారం కొత్తూరు మండలంలో పర్యటించిన ఆయన నివగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల చేరిక శాతం తగ్గుదలపై హెచ్ఎం గెడ్డవలస రాఘవదాస్‌ను అడిగి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాల్లోని విద్యార్థులు చేరేలా వారి తల్లిదండ్రులను చైతన్యం చేస్తున్నామని, జాయినింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తామని కలెక్టర్‌కు విన్నవించారు.

గిరిజన సంక్షేమానికి చర్యలు

టెక్కలి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని ఎంపీడీవో కె.ఫణీంద్ర కుమార్ అన్నారు. శనివారం భీంపురం గ్రామంలో 'ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్' గ్రామసభ నిర్వహించారు. గిరిజను లకు సంబంధించి ఏయే పథకాలు అందజేస్తున్నారో వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి నిర్మల, ఐటీడీఏ సిబ్బంది పాల్గొన్నారు.

భోజన పథకం నిర్వహణలో నిరక్ష్యం వద్దు

హిరమండలం, జూన్ 28(ఆంధ్రజ్యోతి) విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం వద్దని, నాణ్యమైన వంటకాలు పెట్టాలని సర్వశిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్.శశిభూషణ్ అన్నారు. శనివారం హిరమండలం కేజీబీవీని సందర్శించారు. కొత్తగా చేరిన ఆరవ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. వంటశాల, భోజనశాలను తనిఖీ చేశారు. ఆయనతో పాటు కేజీబీవీ ప్రత్యేకాధికారి ఎస్.కృష్ణవేణి ఉన్నారు.

ఉచిత న్యాయసలహాలు పొందండి

నరసన్నపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : పేదలు ఉచిత న్యాయసలహాలను పొందవచ్చని జూనియర్ సివిల్ న్యాయాధికారి వాణి సూచించారు. శనివారం సబ్‌జైలును సందర్శించారు. ఉచిత న్యాయసహాయం కావాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ కొండలరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

పలాస, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కేటీ రోడ్‌కు డివైడర్ మధ్యలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని టీడీపీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ కోరారు. చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన శనివారం మునిసిపల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. 1760 మొక్కలు వివిధ ప్రాంతాల్లో నాటేందుకు సిద్ధమవుతున్న తరుణంలో వాటిని రోడ్డుకు మధ్యలో ఉన్న డివైడర్ల వద్ద వేసి గ్రీనరీ పెంచాలని కోరారు. జోగ త్రివేణి (టీడీపీ కౌన్సిలర్) మాట్లాడుతూ.. ఎంపీ ల్యాడ్ నిధులు మంజూరైనా అభివృద్ధి పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. సమావేశంలో కమిషనర్ ఎస్.రామారావు, డీఈఈ కనకరాజు, కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, డిక్కల ఆనంద్, బోర కృష్ణారావు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడి మృతికి సంతాపం

నందిగాం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పతాపవిశ్వనాథపురం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు కవిటి బాలరాజు మృతిచెందడంతో ఆ పార్టీకి చెందిన నాయకులు నివాళులర్పించారు. శనివారం ఆయన భౌతిక కాయాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.తులసీదాస్, జిల్లా పార్టీ కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యుడు వి.కృష్ణమూర్తి, కె.మోహనరావు సందర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో నంబూరు షణ్ముఖరావు, పి.సాంబ మూర్తి, హెచ్.ఈశ్వరరావు, బగాది వాసుదేవరావు పాల్గొన్నారు.

రేషనలైజేషన్‌ను రద్దు చేయాలి

పోలాకి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): బదిలీల ప్రక్రియ చేపట్టేముందు రేషనలైజేషన్ రద్దు చేయాలని సచివాలయ ఉద్యోగుల సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎంపీడీవో రవికుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీనియార్టీ, ర్యాంక్‌ల జాబితాను బహిరంగంగా ప్రకటించి కౌన్సెలింగ్ చేపట్టాలన్నారు. సొంత మండలాల్లోనే బదిలీ చేయాలని కోరారు. ఇతర ప్రాంతాలకు బదిలీ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటామన్నారు. సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మూడోరోజూ కొనసాగిన నిరసన

కాశీబుగ్గ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మునిసిపల్ పారి శుధ్య కార్మికులు చేపట్టిన నిరసన మూడోరోజు శనివారం కొనసాగింది. గాంధీ విగ్రహం వద్ద నుంచి ర్యాలీ ప్రారంభమై పాత బస్టాండ్ మీదుగా సాగింది. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి గణపతి, యూనియన్ నాయకులు మురు గన్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.